సాక్షి
వరంగల్

ఆదివారం । 5 । అక్టోబర్ । 2025



చిరునవ్వుతో జీవిద్దాం!

చిన్న చిరునవ్వుతో బాధలన్నీ మర్చిపోవచ్చని చెబుతున్నారు వైద్యులు. నేడు ప్రపంచ చిరునవ్వుల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం. - 8లో▸



కాపాస్ కిసాన్ యాప్‌పై శిక్షణ

కాపాస్ కిసాన్ యాప్‌పై శనివారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులకు శిక్షణ ఇచ్చారు. - 8లో▸



వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి



న్యూశాయంపేట: జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట కార్యాచరణ రూపొందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సత్యశారద పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీసీపీ అంకిత్‌కుమార్, అదనపు కలెక్టర్ సంధ్యారాణిలతో కలిసి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు, శాంతిభద్రతలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, చెక్‌పోస్టుల ఏర్పాటు, పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు, రూట్ మ్యాప్‌ల తయారీ, రాజకీయ పార్టీల ప్రచారానికి అనుమతులు తదితర అంశాలపై అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడతలో 5 మండలాలు, రెండో విడతలో 6 మండలాల్లో స్థానిక సంస్థల ఎన్నికల జరుగుతాయన్నారు. ఎన్నికలు శాంతియుత నిర్వహణకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎన్నికల ప్రవర్తన నియమావళి)ను కఠినంగా అమలు చేయాలని, జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశామని, ఎన్నికల సిబ్బందితో పాటు అదనంగా సిబ్బందిని నియమించి, ఎన్నికల విధుల నిర్వహణపై శిక్షణ ఇవ్వాలన్నారు.

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేయాలి

మండల కేంద్రాల్లో నామినేషన్ల స్వీకరణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. నామినేషన్ల స్క్రూటినీ, ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు ప్రక్రియపై సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. పోలింగ్ రోజు పాటించాల్సిన నిబంధనలు, విధులపై అధికారులకు ముందుగానే సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. పోటీలో ఉండే అభ్యర్థులు ఫైనల్ అయిన తర్వాత పొరపాట్లు జరగకుండా బ్యాలెట్ పేపర్ల ముద్రణ జరగాలని, ఎన్నికల నిర్వహణకు అవసరమైన వాహనాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీపీఓ కల్పన, ఆర్డీ ఓలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, జిల్లా నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీఓలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కంఠమహేశ్వరస్వామి ఉత్సవాలు షురూ



నర్సంపేట: నర్సంపేట పట్టణంలో కంఠమహేశ్వరస్వామి ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పట్టణ గౌడ సంఘం ఆధ్వర్యంలో ప్రారంభమైన ఉత్సవాల్లో సంఘం అధ్యక్షుడు కోల వెంకటేశ్వర్లుగౌడ్, కార్యదర్శి మద్దెల శ్రీనివాస్‌గౌడ్, సభ్యులు వేడుకలను ప్రారంభించారు. కంఠమహేశ్వరస్వామి ఆలయం, సంఘం కార్యాలయంలో పూజలు చేశారు. అక్కడి నుంచి డప్పు చప్పుళ్లు, డీజే సౌండ్స్‌తో గ్రామ దేవత బొడ్రాయి వద్ద పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని శివాంజనేయ స్వామి, వేంకటేశ్వరస్వామి, గుడి మైసమ్మ, సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పోచమ్మతల్లి, ముత్యాలమ్మ తల్లి, పెద్దమ్మ తల్లిని బోనాలతో సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గాదగోని సాంబయ్యగౌడ్, ఆర్థిక కార్యదర్శులు నాతి సదానందంగౌడ్, గిరగాని కిరణ్‌గౌడ్, డైరెక్టర్స్ శ్రీనివాస్‌గౌడ్, సురేష్, కృష్ణ, రమేశ్, ప్రమోద్, రవి, కొమురయ్య, సారయ్య, కనుకయ్య, సాంబయ్యలు పాల్గొన్నారు.

'స్థానిక ఎన్నికల్లో గుణపాఠం తప్పదు'



వర్ధన్నపేట: అధికార పార్టీ కాంగ్రెస్‌కు స్థానిక ఎన్నికల్లో గుణపాఠం తప్పదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని ఇల్లంద గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ తరఫున పార్టీ ప్రజలకు కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పట్టంకడతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంచాల కుమారస్వామి, తూళ్ల కుమారస్వామి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గొట్టు గోత్రాలు.. పడిగ బొమ్మలు

మేడారం గద్దెలు, సాలహారం, నూతన ఆర్చీ ద్వారాలపై 700 ఆదివాసీ చిత్రాలు

- 3 నుంచి 7 గొట్ల వంశస్తుల సంస్కృతీ సంప్రదాయం పరిఢవిల్లేలా ఏర్పాటు
- వెయ్యేళ్లు నిలిచేలా రాతికట్టడాలు, గద్దెల ప్రాంగణం విస్తీర్ణం ఆధునికీకరణ
- తల్లుల గద్దెలు కదిలించకుండా నిర్మాణం
- మారనున్న వనదేవతల గద్దెల ప్రాంగణం రూపురేఖలు



వనదేవతల గద్దెల ప్రాంగణం నమూనా చిత్రం

సండే స్పెషల్

కోయల పూర్వ మూలాలు, పడిగ బొమ్మలు, పూర్వ కోయ రాజ్యాల చరిత్ర, గొట్టు గోత్రాలు (పూర్వం ప్రకృతి సమతుల్య సిద్ధాంతంలో భాగంగా ఆదివాసీలు తమ వంశవృక్షాలను 3 నుంచి 7 గొట్లుగా ఏర్పాటు చేసుకుని ప్రకృతిలోని జంతువులు, చెట్లు, పక్షులు, రాజ్య వ్యవస్థ సింబల్‌ను దైవాలుగా పంచుకున్నారు)... వీటిని మేడారం అమ్మవార్ల గద్దెలు, సాలహారం, నూతన ఆర్చీ ద్వారాలపై తీర్చిదిద్దనున్నారు. ఆలయం మొత్తం కొండ గుహల్లో దొరికిన పూర్వ కోయ రాజ్యాలు నడిచిన క్రమంలో రాసిన తాళపత్ర గ్రంథాల ఆధారంగా వాస్తుప్రకారం రూపుదిద్దుకోనుంది. వెయ్యేళ్లు ఆదివాసీల చరిత్ర నిలిచేలా అమ్మవార్ల గద్దెల ప్రాంగణాన్ని అభివృద్ధి చేయనున్నారు. మేడారం పునర్నిర్మాణంలో ఏయే అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు.. ఆలయంలో రానున్న ఆర్చీలు, సాలహారంపై ఆదివాసీ చరిత్ర, ప్రకృతితో వారికున్న అనుబంధం తెలిపే బొమ్మల విశేషాలే ఈ వారం సండే స్పెషల్ కథనం.

– ఎస్ఎస్‌తాడ్వాయి



ఆదివాసీ మూలాలు, సంస్కృతీసంప్రదాయ చిత్రాలతో ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క– సారలమ్మ గద్దెల ప్రాంగణం ఆధునికీకరణకు ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. మొత్తంగా 8 ఆర్చీలు, గద్దెల ప్రాంగణం చుట్టూ ప్రహరీపై 700 ఆదివాసీ చిత్రాలను ఏర్పాటుచేయనున్నారు. అమ్మవార్ల గద్దెలను కదిలించకుండా కోయ మూలాలతో అభివృద్ధి పనులను చేపట్టారు. వనదేవతల వరుస క్రమంలో సమ్మక్క–సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెలను ఏర్పాటు చేయనున్నారు. 300 ఫీట్ల వెడల్పు, 1000 ఫీట్ల మేర చుట్టూ ప్రహరీ నిర్మించనున్నారు.



ఆదివాసీ గొట్టుగోత్రాల చిత్రాలు



తాబేలుపై కోయరాజుల బొమ్మలు



ఇది దేశ పురోగమన చరిత్ర



సీఎం రేవంత్ రెడ్డి ఆదివాసీ సంస్కృతి సజీవంగా నిలిచేలా ఆదివాసీ మూలాలతో అమ్మవార్ల గద్దెల ప్రాంగణం అభివృద్ధి చేయడం మా అదృష్టం. ఇది దేశ పురోగమన చరిత్ర. ఆలయ ప్రాంగణం విస్తీర్ణంలో ఆదిమ మూలం బొమ్మలు లిఖించే అవకాశం దక్కడం మంత్రి సీతక్క, సమ్మక్క– సారలమ్మ పూజారులకు, ఆదివాసీలకు మరువలేని జ్ఞాపకం. ఆదివాసీల ఆత్మగౌరవానికి అండగా ఉంటామని ప్రకటించడం చాలా సంతోషకరం.

– డాక్టర్ మైపతి అరుణ్‌కుమార్

అమ్మవార్ల గద్దెల పక్కన 8 పిల్లర్లు

అమ్మవార్ల గద్దెల పక్కన 8 పిల్లర్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ పిల్లర్లు ఫీటున్నర వెడల్పు, 8 ఫీట్ల పొడవుతో ఏర్పాటు చేస్తారు. వీటిపై 340 బొమ్మలు వేయనున్నారు. పూర్తిగా సమ్మక్క వంశం సిద్ధబోయినవారి పవిత్ర బొమ్మలతోపాటు పూజావిధానం, వారి వంశ వృక్షం ఉంటుంది. సారలమ్మ గద్దె పక్కన పిల్లర్లపై కూడా ఇదే పద్ధతిలో 342 బొమ్మలు వేస్తారు. సారలమ్మ వంశం, 3వ గొట్టు పవిత్ర బొమ్మల చిత్రాలు వేస్తారు. పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెలపై 172 చొప్పున 344 బొమ్మలు, వారి వంశవృక్షం పవిత్ర బొమ్మలు వేస్తారు.

జంపన్న ప్రత్యేకం

పగిడిద్దరాజు – నాగులమ్మ కొడుకు జంపన్న గద్దె జంపన్న వాగు ఒడ్డున ఉంది. అక్కడే ఈ గద్దెను అభివృద్ధి చేయాలని పూజారులు నిర్ణయించారు. జంపన్న తమ్ముడైన ముయాన్న గద్దె ఏర్పాటు, వనం పోతురాజు ఇంకా కాపలాగా ఉండే పొలిమేర దేవతల ఏర్పాటును శాస్త్రీయ బద్ధంగా పూజారులు తీసుకున్నారు.





పడిగలపై ఉన్న ఆదివాసీ, గిరిజన సంస్కృతీ సంప్రదాయాల చిత్రాలు



కోయ సంస్కృతీ చిత్రాలు



ఆదివాసీ మూల తాళపత్రాలు

- ఎడమ వైపు పిల్లర్లపై మూడవ గొట్టు మూలం 3 నిలువు బొట్లు, త్రిభుజం రాజ్య సింబల్, సారలమ్మ కోసం స్వయంవరంలో బాణంతో కాకిని కొట్టి కాక అడమరాజు సారలమ్మను పెళ్లి చేసుకున్న మనిషితో కూడిన బాణం ఉంటుంది. కాకి బొమ్మ, సిద్ధబోయిన వంశస్తుల వద్దే గోత్రం వృక్షం ఇప్పచెట్టు, చిలకలగట్టునుంచి దేవతను తీసుకొచ్చే సందర్భం బొమ్మలు.. ఇలా ప్రకృతిలోని జంతువులు, పక్షులు, చెట్ల చిత్రాలను ఈ ఆర్చీలో చేర్చి మేడారం జాతర అంటే ప్రకృతి జాతర అనేలా రూపుదిద్దుతారు.
- ఆలయంలోని తూర్పు ఈశాన్యం ద్వారం ద్వారా భక్తులు వెళ్తారు. ప్రధాన ద్వారం పూర్తిగా 5వ గొట్టు మూలం బొమ్మలు 25 రకాలు ఉంటాయి. వారి వంశ వృక్షం ఉంటుంది. పక్కన ద్వారం సిద్ధబోయిన కొక్కెర వారి మూల వంశవృక్షం 25 బొమ్మలతో ఉంటుంది. మరో ద్వారం తూర్పు ఆగ్నేయంలో ఉంటుంది. ఇది పగిడిద్దరాజుది. దీనిలో 4వ గొట్టు మూలం పూర్తిగా 25 బొమ్మలతో ఉంటుంది. తాబేలు బొమ్మపై ఉన్న నలుగురు పగిడిద్దరాజు, గోవిందరాజు, నాగుల బండడు, ముల్లూరుడిని తెలుపుతుంది. సమ్మక్క భర్త కావడంతో పగిడిద్దరాజు కుడివైపున ఉంటాడు. మధ్యలో వీరి పెళ్లి చేసిన సిద్ధబోయిన వంశం వారు ఉండేలా రూపొందించారు. వెనుక భాగంలో గోవిందరాజు ద్వారం కూడా 4వ గొట్టు మూలాన్ని తెలుపుతుంది.
- ప్రధాన ద్వారం వెనుక వైపు సారలమ్మది. దీనిపై పూర్తిగా 3వ గొట్టు మూలం జంతువులు, పక్షులు వేస్తూ కాక అడమ రాజు, సారలమ్మ మూలం తీసుకున్నారు. సమ్మక్క చెల్లెలు నాగులమ్మకి పుట్ట పోసేందుకు 5 మీటర్ల ఖాళీ స్థలం వదిలేశారు. మిగతా ద్వారాలను సాధారణ కోయ మూలాలతో ఏర్పాటు చేస్తున్నారు.

40 ఫీట్ల ఎత్తుతో ప్రధాన ద్వారం

ప్రధాన ఆర్చీ ద్వారం 40 ఫీట్ల ఎత్తుతో నిర్మించనున్నారు. దీనిపై బండానీ వంశం సమ్మక్క తల్లి 5వ గొట్టు వంశస్తుల పూజిత జంతువు ఒంటికొమ్ము దుప్పి, అటు ఇటు చివరన అడవిదున్న కొమ్ములు, నెమలి ఈకలు ఏర్పాటుచేస్తారు. ఇవి ఆదివాసీల అస్తిత్వానికి రూపాలు. పక్కన రెండు వైపులా నాగులమ్మ (సమ్మక్క చెల్లెలు) పాము రూపంలో ఉంటుంది. వరుసగా కోయ సమాజంలో 6వ గొట్టు ఏనుగు, 3వ గొట్టు ఎద్దు, 4వ గొట్టు ఖడ్గమృగం, 5వ గొట్టు ఒంటి కొమ్ము దుప్పి, 7వ గొట్టు మనుబోతు, 8వ గొట్టు సమ్మక్క తల్లిని చిలకలగట్టు నుంచి తీసుకువచ్చే సిద్ధబోయిన వారి సింహాలు వరుసగా ఏర్పాటు చేస్తారు. ఇందులో మూర్తి అక్కుమ్ (తూత కొమ్ము) ప్రత్యేకం. దేవత ఈ శబ్దం ద్వారానే వస్తుంది అనేది సంకేతం. కింద పిల్లర్లపై కుడి వైపు 5వ గొట్టు తెలిపేలా 5 నిలువు గీతలు, పూజిత పక్షి పావురం, నెమలి పూజిత వృక్షం వెదురు చెట్టు, బండారి చెట్టు, 4వ గొట్టు సమ్మక్క భర్త మూలం తెలిపే 4 నిలువు గీతలు, పూజిత పక్షి సోనోడి పిట్ట, పాలపిట్ట, వృక్షం బూరుగు చెట్టు, తాబేలు ఏర్పాటు చేయనున్నారు.



వ్యూహాలకు పదును..

'స్థానిక' ఎన్నికలకు పావులు కదుపుతున్న అగ్రనేతలు

- ప్రధాన రాజకీయపార్టీల్లో సాగుతున్న కసరత్తు
- ఇన్‌చార్జ్ మంత్రులు, ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక బాధ్యత
- నేటినుంచి నియోజకవర్గాల్లో కార్యకర్తల సమావేశాలు



సాక్షిప్రతినిధి, వరంగల్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రధాన రాజకీయ పార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఉమ్మడి వరంగల్ పరిధిలోని ఆరు జిల్లా జెడ్పీలతో పాటు ఎంపీపీలు, సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకునేందుకు పావులు కదుపుతున్నాయి. గెలుపు గుర్రాలను రంగంలోకి దింపేందుకు అన్ని పార్టీలు కసరత్తు మొదలెట్టాయి. అధికార కాంగ్రెస్ పార్టీ ఈ విషయంలో ఓ అడుగు ముందుకు వేసి నియోజకవర్గస్థాయి సమావేశాల ద్వారా దరఖాస్తులు స్వీకరించేందుకు ఆదివారం నుంచి కార్యాచరణను అమలు చేయనుంది. బీఆర్ఎస్ నాయకులు ద్వితీయ శ్రేణి నేతలు, కేడర్‌తో సంప్రదింపులు చేస్తున్నారు. బీజేపీ కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని రాష్ట్ర కమిటీ సందేశం పంపింది. ఇక వామపక్షాలు, తెలంగాణ రాజ్యాధికార పార్టీ, బీఎస్పీ తదితర పార్టీలు సైతం కార్యకలాపాలు చేస్తున్నాయి.

ఇన్‌చార్జ్ మంత్రి, ఎమ్మెల్యేలకు కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక బాధ్యత..

జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, ఎమ్మెల్యేలు జిల్లా కమిటీ అధ్యక్షులు, ముఖ్యనేతలను సమన్వయం చేసుకుని అభ్యర్థులను ఎంపిక చేసే పనిలో ఉన్నారు. ఈ మేరకు ఆదివారం నుంచి నియోజకవర్గాల వారీగా కార్యకర్తల సమావేశం నిర్వహించి అభిప్రాయ సేకరణ చేయనున్నారు. ఇదే సమయంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు పోటీ పడే వారినుంచి దరఖాస్తులు కూడా స్వీకరించనున్నారు. ఒక్కో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ స్థానం నుంచి నాలుగు నుంచి ఐదు పేర్లను పరిశీలించి అధిష్టానానికి ప్రతిపాదించనున్నారు. స్థానిక అభ్యర్థులకు ఈ విషయంలో ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ప్రజాదరణ, కార్యకర్తల మద్దతు ప్రాధాన్యాంశాలు కానున్నాయని, అభ్యర్థుల ఎంపిక అధిష్టానం సూచనల మేరకు పారదర్శకంగా ఉంటుందని ఓ ప్రజాప్రతినిధి తెలిపారు. నియోజకవర్గాల వారీగా నిర్వహించే సమావేశాలు కీలకమైనందున కార్యకర్తలు, నాయకులు హాజరయ్యేలా చూసుకోవాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం జిల్లా ఎమ్మెల్యేలకు సూచించినట్లు తెలిసింది. ఈ మేరకు ఎమ్మెల్యేలు ముందుగానే నాయకులు, కార్యకర్తలకు సమాచారం అందించేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఆరు జెడ్పీలపై గురి...

కాంగ్రెస్, బీఆర్ఎస్... ఈ రెండు పార్టీలు ఆరు జిల్లా ప్రజాపరిషత్ స్థానాలపై గురిపెట్టాయి. బీజేపీ సైతం గట్టి పోటీ ఇవ్వాలని భావిస్తోంది. ఈసారి హనుమకొండ జెడ్పీ ఎస్సీ మహిళ, వరంగల్ ఎస్టీ జనరల్, ములుగు ఎస్టీ మహిళ, జనగామ ఎస్సీ మహిళ, మహబూబాబాద్ జనరల్, భూపాలపల్లి బీసీ జనరల్‌కు రిజర్వు చేశారు. వాస్తవానికి హనుమకొండ, వరంగల్, జనగామలు జనరల్‌కు వస్తాయని ఆశావహులు భావించారు. అందుకు భిన్నంగా రిజర్వేషన్‌లు ఉండటంతో ఆశావహుల అంచనాలు దెబ్బతినగా.. ఈ ఆరింటిని ఎలా కైవసం చేసుకోవాలి? అన్న వ్యూహంలో ప్రధాన పార్టీల నాయకత్వం యోచిస్తోంది. ఇదే సమయంలో 12 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 75 జెడ్పీటీసీ స్థానాలు.. 75 ఎంపీపీ పదవులను దక్కించుకోవడం కూడా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారింది. 778 ఎంపీటీసీలు, 1,705 సర్పంచ్ పోస్టులకు రిజర్వేషన్‌ల ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేసి గెలిపించుకోవడం పెద్ద టాస్క్‌గా మారింది. కాగా ఈ నెల 8న రిజర్వేషన్‌లపై దాఖలైన పిటిషన్‌పై విచారణ, తీర్పు ఉండగా.. ఆ మరుసటి రోజైన 9 నుంచి మొదటి విడత ఎన్నికల జరిగే ప్రాంతాల్లో అభ్యర్థులు నామినేషన్లు వేసేలా పార్టీలు కసరత్తు చేస్తున్నాయి. గెలుపు గుర్రాల ఎంపికలో ప్రధాన పార్టీలు పావులు కదుపుతుండగా.. పల్లెల్లో 'స్థానిక' సందడి జోరందుకుంటోంది.

దసరాకు ఫుల్ కిక్కు!

- రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు
- గతేడాదితో పోల్చుకుంటే బీర్ల విక్రయాలు 23.8శాతం, లిక్కర్ అమ్మకాలు 10.9 శాతం వృద్ధి
- ఈనెల 1, 3వ తేదీల్లోనే రూ.కోట్ల వ్యాపారం



సాక్షి, వరంగల్: జిల్లాలో దసరా పండుగ మద్యం వ్యాపారులకు ఫుల్ కిక్కు ఇచ్చింది. గతేడాది కంటే ఈ ఏడాది మద్యం అమ్మకాలు రికార్డుస్థాయిలో పెరిగాయి. గతేడాది సెప్టెంబర్ నెలలో 7,22,294 బీర్లు తాగితే ఈసారి ఏకంగా 8,95,200 బీర్లు మందుబాబులు తాగారు. దసరా పండుగ నేపథ్యంలో ఈనెల 2న వైన్స్ బంద్ ఉంటాయన్న ప్రకటనతో మందుప్రియులు ముందుగానే బీర్లను కొనుగోలు చేశారు. వీరితో పాటు బెల్ట్ షాప్ నిర్వాహకులు కూడా ఎక్కువ మొత్తంలో బీర్లను వైన్‌షాపుల నుంచి కొని డంప్ చేసుకున్నారు. లిక్కర్ ప్రియులు కూడా గతేడాది 41,283 కాటన్లు తాగితే ఈసారి 45,783 కాటన్లు లాగించేశారు. గతేడాది సెప్టెంబర్ నెలతో పోల్చుకుంటే బీర్ల విక్రయాలు 23.8 శాతం పెరిగితే, లిక్కర్ విక్రయాలు 10.9 శాతం అదనంగా అమ్ముడయ్యాయని ఎక్సైజ్ గణాంకాలు చెబుతున్నాయి. 2024 సెప్టెంబర్‌లో రూ.42.40 కోట్ల వ్యాపారం జరిగితే, ఈసారి రూ.51.868 కోట్ల వ్యాపారం జరిగింది. సుమారు రూ.9కోట్లకు పైగా ఆదాయం సమకూరింది. దసరా పండుగ వేళ సెప్టెంబర్ నెలాఖరుతో పాటు అక్టోబర్ ఒకటి, మూడు తేదీల్లో రూ.9 కోట్లకు పైగానే మద్యం విక్రయాలు జరిగాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

బీర్ల విక్రయాలిలా..

ఎక్సైజ్ స్టేషన్	2024 సెప్టెంబర్	2025సెప్టెంబర్
నర్సంపేట	22,654 కాటన్లు	26,335 కాటన్లు
పరకాల	22798 కాటన్లు	26,891 కాటన్లు
వర్ధన్నపేట	14,795 కాటన్లు	21,374 కాటన్లు

ఎక్కడెక్కడ ఎంత వ్యాపారం అంటే..

జిల్లాలో 63 మద్యం దుకాణాలున్నాయి. నర్సంపేటలో 25, పరకాలలో 22, వర్ధన్నపేటలో 16 వైన్‌షాప్‌లు ఉండగా ఆరు బార్లు ఉన్నాయి. అయితే 2024లో నర్సంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో రూ.15.72 కోట్ల మద్యం వ్యాపారం జరిగితే ఈసారి రూ.19.763 కోట్ల మద్యం వ్యాపారం జరిగింది. పరకాల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో రూ.16.43 కోట్ల బిజినెస్ జరిగితే ఈసారి రూ.19.082 కోట్ల మద్యం వ్యాపారం జరిగింది. వర్ధన్నపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో రూ.10.25 కోట్ల బిజినెస్ జరిగితే ఈసారి రూ.13.023 కోట్ల మద్యం వ్యాపారం జరిగింది. మొత్తంగా అన్ని ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలో మద్యం విక్రయాలు పెరిగాయి. ఈ నెల 2న దసరా పండుగ, అదే రోజు గాంధీ జయంతి ఉండడంతో ఒకటి, మూడు తేదీల్లో రూ.9కోట్లకు పైగానే ఆదాయం వచ్చిందని అధికారులు అంచనా వేస్తున్నారు.

రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకం

- అదనపు కలెక్టర్ సంధ్యారాణి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

న్యూశాయంపేట: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమని జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. శనివారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ సీఈఓ రాంరెడ్డితో కలిసి ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రిటర్నింగ్ అధికారులు విధుల్లో నిర్లక్ష్యంగా ఉండొద్దన్నారు. ఆర్ఓ విధులు, బాధ్యతలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. ప్రతీ మండలంలో మూడు లేదా నాలుగు ఎంపీటీసీలకు ఒక రిటర్నింగ్ అధికారి, ప్రతీ జెడ్పీటీసీకు రిటర్నింగ్ అధికారిని నియమించామన్నారు. రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నిర్వహణ నియమావళి ప్రకారం ఎన్నికల నోటీసు ఇవ్వాలని, నామినేషన్ల స్వీకరణ, రిటర్నింగ్ అధికారి కార్యాలయం నోటీసు బోర్డుపై స్వీకరించిన అభ్యర్థుల నామినేషన్ పత్రాల జాబితా, స్వీయ ప్రకటన ప్రతులను ప్రచురించాలని, నామినేషన్ పత్రాల పరిశీలన, తిరస్కరించినట్లయితే దానికి గల కారణం తెలపాలని, నామినేషన్ పత్రాల జాబితా ప్రచురించాలని, అభ్యర్థుల ఉపసంహరణ నోటీసు స్వీకరించాలని, పోటీ చేయు జాబితా, గుర్తులు కేటాయింపు, బ్యాలెట్ పేపర్ ముద్రణ, ఫలితాలు ప్రకటించే వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందన్నారు. ప్రతిరోజు పీపుల్ సాఫ్ట్‌వేర్‌లో ఆర్ఓలు నివేదికలను ఎలక్షన్ ప్రాసెస్ మోడల్‌ను ఉంచాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో జిల్లా, రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంబేడ్కర్ వర్సిటీలో ప్రవేశాలకు 10వ తేదీ గడువు



విద్యారణ్యపురి: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2025–2026 విద్యాసంవత్సరంలో బీఏ, బీకాం, బీఎస్సీ తదితర కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 10వ రకు గడువు ఉందని, ఇదే చివరి అవకాశమని ఆ యూనివర్సిటీ స్టూడెంట్స్ సర్వీస్ విభాగం డైరెక్టర్ డాక్టర్ వై. వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో ప్రవేశాలకు ఇంటర్మీడియట్ లేదా ఓపెన్ ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ, 10ప్లస్ 2 ఉత్తీర్ణులైన అభ్యర్థులు ప్రవేశాలు పొందొచ్చని తెలిపారు. అలాగే, డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు పీజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందొచ్చని తెలిపారు. బీఏ, బీఎస్సీ, బీటెక్, బీబీఏ విద్యార్థులు ఎంఏ ఇంగ్లిష్, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, చరిత్ర, ఎకనామిక్స్, సోషియాలజీ, ఎంఏ జర్నలిజం కోర్సులు కూడా చదువుకునే అవకాశం ఉందన్నారు. బీఎస్సీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు ఎమ్మెస్సీ మ్యాథ్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ, ఎన్విరాన్‌మెంట్ సైన్స్‌లో ప్రవేశాలు పొందొచ్చనని తెలిపారు. ఓపెన్ యూనివర్సిటీలో చేరే విద్యార్థులకు రిటైల్ రంగంలో ఉపాధి కల్పించేందుకుగాను ఆర్ఏఎస్‌సీఐ సంస్థతో కూడా యూనివర్సిటీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుందన్నారు. విద్యార్థులకు ఒకేషనల్ ట్రెనింగ్‌లో ఆసక్తి ఉంటే రామనందతీర్థ రూరల్ ఇన్‌స్టిట్యూట్ కూడా శిక్షణ ఇవ్వనుందని ఆయన తెలిపారు. విద్యార్థులు దరఖాస్తులు చేసుకునేందుకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఆర్‌ఏవోయూ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

ఖిలా వరంగల్: ఆరుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.3,200 నగదు, 3 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ రమేశ్ తెలిపారు. వరంగల్ శివనగర్ లోని మసీదు వీధి సమీపంలో ఓ ఇంట్లో ఒక పురుషుడు, ఐదుగురు ట్రాన్స్‌జెండర్లు పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు శనివారం ఉదయం ఆ ఇంటిపై దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలో ఈసారపు సైదులు, గుగులోత్ రమ, పండిబోతు ప్రత్యూష, గుగులోత్ వంశీక, గుగులోత్ వినజ, గుగులోత్ స్వప్న ఉన్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రమేశ్ తెలిపారు.

యువకుల మధ్య ఘర్షణ

రామన్నపేట: వరంగల్ మండిబజార్‌లో యువకుల మధ్య ఘర్షణ జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున మండిబజార్‌లోని ఖుర్షీద్ హోటల్‌లో బిర్యానీ తినేందుకు గిర్మాజీపేటకు చెందిన నీలారపు రణవీర్ తన తమ్ముడు సూర్యతో వచ్చాడు. ఆ సమయంలో నితీశ్, తరుణ్, చందుతో పాటు మరికొంత మంది వ్యక్తులు రణవీర్‌పైదాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో రణవీర్‌కు తీవ్ర గాయాలు కాగా ఎంజీఎంలో చికిత్స పొందాడు. ఈ ఘటనలో ఖుర్షీద్‌తోపాటు దాడికి పాల్పడిన యువకులపై కేసు నమోదు చేసినట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ తెలిపారు.

చిరునవ్వుతో జీవిద్దాం!

చిరునవ్వే మనిషికి చెరగని ఆభరణం

- స్మైల్‌తో అనేక మానసిక రుగ్మతలు దూరం
- నవ్వడం యోగం.. నవ్వకపోవడం రోగం..
- నేడు ప్రపంచ చిరునవ్వుల దినోత్సవం

ఖిలా వరంగల్: చిరునవ్వు.. వ్యక్తిత్వానికి ప్రతిబింబం. కొందరి చిరునవ్వు శత్రువునైనా సమ్మోహన పరుస్తుంది. అందుకే నవ్వులోని ఆప్యాయత, అనురాగం మరెందులోనూ ఉండదు. అయితే ప్రస్తుత ఉరుకులు, పరుగుల జీవనంలో చాలా మంది మన స్ఫూర్తిగా నవ్వడమే మరచిపోతున్నారు. తీవ్ర ఒత్తిడి, వివిధ సమస్యలతో నవ్వుకు దూరమవుతున్నారు. అయితే చిన్న చిరునవ్వుతో బాధలన్నీ మరచిపోవచ్చని చెబుతున్నారు వైద్యులు. చర్మం మెరుగులు దిద్దుకుంటుందని, ఆయుష్షు పెరుగుతుందని, మనుషుల మధ్య సంబంధాలు కూడా మెరుగుపడతాయని స్పష్టం చేస్తున్నారు. నేటి జీవితంలో నవ్వకపోవడం రోగమేనని వారంటున్నారు. ఈ నేపథ్యంలో ఆధునిక జీవనంలో వేదనలు.. రోదనలు.. చింతనలు.. ఆలోచనల నడుమ హాయిగా నవ్వుకోవాల్సిన అవసరం ఉంది. ఆదివారం ప్రపంచ చిరునవ్వుల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

నేటి నానుడి నవ్వు నాలుగు విధాలా స్వీట్..

నాటి నానుడి.. నవ్వు నాలుగు విధాలా చేటు. నేటి నానుడి.. నవ్వు నాలుగు విధాలా స్వీట్. నవ్వు ప్రకృతి ప్రసాదించిన వరం. ముఖానికి ఎన్ని సౌందర్య సాధనాలద్దినా.. చిరునవ్వుకు సరి తూగవు. మనసారా నవ్వితే శరీరంలో కొన్ని ప్రత్యేక రసాయనాలు విడుదలవుతాయి. కొండంత కోపాన్ని హరించి ఎలాంటి వాతావరణాన్నైనా చల్లబరిచేది చిరునవ్వే.

ప్రస్తుత సమజంలో మనుషుల యాంత్రిక జీవనం..

ప్రస్తుత సమజంలో మనుషులు యాంత్రిక జీవనం గడుపుతున్నారు. ఎదుటి వ్యక్తితో మాట్లాడాలంటే సెల్‌ఫోన్ చూస్తూనో.. కంప్యూటర్ పనిలో ఉన్నప్పుడో కాస్త చిరునవ్వుతో పలకరిస్తున్నారు. ఇది కూడా కనీసం ఐదు సెకండ్లకు మించి ఉండడం లేదు. అంటే మనిషిని సాంకేతికత ఎంతగా అపహరించిందో అర్థం చేసుకోవచ్చు. చేతిలోకి సెల్‌ఫోన్ వచ్చిన తర్వాత కుటుంబమంతా సరదాగా నవ్వుకుని కాలం గడిపే రోజులు ఎప్పుడోపోయాయి. ఎదుటి మనిషితో మాటలు కరువయ్యాయి.



చిరునవ్వు దివ్య ఔషధం..

మనిషికి చిరునవ్వు దివ్య ఔషధంలా పనిచేస్తుందని వైద్యులు చెబుతున్నారు. రోజులో ఎక్కువ సార్లు నవ్వితే 15 నిమిషాలు వ్యాయామంతో సమానమని చెబుతున్నారు. నవ్వు రోగ నిరోధక శక్తిని పెంచుతుందని వైద్యశాస్త్రం చెబుతుంది. అందుకే లాఫింగ్ క్లబ్‌లో బిగ్గరగా నవ్వుతూ వ్యాయామం చేస్తుంటారు. ఇటీవల నవ్వుతో యోగా, వ్యాయామం చేసే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. నవ్వకపోతే మనిషిలో మానసిక రుగ్మతలు పెరిగిపోతాయి. మనసును ప్రశాంతంగా ఉంచి జీవితాన్ని ఆరోగ్యంగా, ఆనందంగా ఉంచే మార్గం నవ్వు మాత్రమేనని చెప్పక తప్పదు. అందుకే మనస్ఫూర్తిగా చిరునవ్వుతో పలకరిద్దాం.. చిరకాలం జీవిద్దాం.

నవ్వు ఆరోగ్యానికి మేలు



నవ్వు..ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఒక్కసారి నవ్వితే శరీరంలో సుమారు వంద కండరాలు కదలుతాయి. దీని వల్ల రక్త ప్రసరణ సులువుగా జరుగుతుంది. ఒక్కసారి నవ్వితే కళ్లలో కన్నీరు వస్తుంది. అంటే నవ్వినప్పుడు కండరాలతోపాటు మెదడు, కళ్లు, కాలేయం చోట కదలిక వస్తుందని గుర్తించాలి. అందుకే మా దగ్గరకు వచ్చిన రోగులను ముందుగా చిరునవ్వుతో పలకరిస్తాం.ఆ తర్వాతే ఎలాంటి సమస్య ఉందో తెలుసుకుంటాం. నవ్వుతో అనేక మానసిక రుగ్మతలు దూరమవుతాయి.

– డాక్టర్ నరేశ్‌కుమార్, వరంగల్

ఎన్నో ప్రయోజనాలు

మానవ శరీంలో దెబ్బతిన్న కణాలు బాగు చేసే శక్తి కూడా నవ్వుకు ఉంది. నవ్వితే కోపం, భయం, అసూయ, ఆందోళన, ద్వేషం, ఒత్తిడి మాయమవుతాయి. కడుపుబ్బ నవ్వితే 20 నిమిషాలు వ్యాయామంతో సమానం. సుమారు మూడున్నర కేలరీలు ఖర్చు అవుతాయి. ఎప్పుడు నవ్వుతూ ఉండేవారి రక్తనాళాల్లో బ్లడ్ క్లాట్స్ ఏర్పడడం తగ్గుతుంది. గుండె జబ్బులు దూరమవుతాయి. చిరునవ్వు ముఖాన్ని కాంతివంతంగా ఉంచుతుంది. ఒక్కసారి గట్టిగా నవ్వితే శరీరంలోని 108 కండరాలకు శక్తి వస్తుంది. నవ్వు ఒత్తిడి తగ్గించి ఆనందాన్ని పెంచే హార్మోన్‌ను ఎక్కువగా విడుదల చేస్తుంది. శరీరంలో ఆక్సిజన్ పెంపొందిస్తుంది.

కాపాస్ కిసాన్ యాప్‌పై శిక్షణ



మాట్లాడుతున్న వ్యవసాయ మార్కెటింగ్ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు శ్రీనివాస్

హన్మకొండ: కాపాస్ కిసాన్ యాప్‌పై శనివారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులకు శిక్షణ ఇచ్చారు. వరంగల్ ప్రాంతీయ సంయుక్త మార్కెటింగ్ సంచాలకుడు వి.శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని ఈ యాప్‌పై శిక్షణ ఇచ్చారు. రైతులు పత్తి అమ్ముకునేందుకు తప్పని సరిగా స్లాట్ బుకింగ్ చేసుకోవాలన్నారు. అన్నదాతలు తమ స్మార్ట్ ఫోన్‌లో కాపాస్ కిసాన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులు రైతులకు యాప్‌పై అవగాహన కల్పించాలన్నారు. పత్తి కొనుగోలు సంబంధిత సేవలకు రైతులు టోల్ ఫ్రీ నంబర్ 18005995779, వాట్సాప్ సేవలకు 8897281111 నంబర్‌ను సంప్రదించాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారులు, ఏడీఈలు, ఎంఏఓలు, ఏఈఓలు పాల్గొన్నారు.

ఎండీఎం అమలుకు కొత్త నిబంధనలు

- విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలు

కాశోజీ సెంటర్ : పీఎం పోషణ (మధ్యాహ్న భోజన పథకం.. (ఎండీఎం) పకడ్బందీ అమలు కోసం తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ ఇ.నవీన్ నికోలస్ కొత్త నిబంధనలు పాటించాలని జిల్లా(డీఈఓ), మండల(ఎంఈఓ) విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీచేశారు. మండల విద్యాధికారి (ఎంఈఓ), ప్రధానోపాధ్యాయులు తప్పని సరిగా రోజువారీగా పాఠశాలల విద్యార్థుల హాజరు, వంట మనుషులు, వంట సహాయకుల వివరాలు ఎస్‌ఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. నెల వారీ బిల్లుల సమర్పణ కోసం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రతీ నెలా బిల్లులను ఆ నెల చివరి పనిదినంలో లేదా తర్వాత నెల మొదటి రెండు పనిదినాలోపు సంబంధిత మండల విద్యాశాఖ అధికారికి సమర్పించాలన్నారు. ఎంఈఓ తమ పరిధిలోని పాఠశాలల బిల్లులను పరిశీలించి నిర్ధారించుకున్న తర్వాత ట్రెజరీకి ప్రతీ నెల 5వ తేదీ లోపు ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్ ద్వారా ట్రెజరీ అధికారికి ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు. కేంద్రీకృత వంటశాలలు, అక్షయ పాత్ర ఫౌండేషన్, మన్న ట్రస్టు వంటి ఏజెన్సీలు కూడా ఇదే విధానం పాటించాలని ఆదేశించారు.

ఎమ్మెల్యే 'దొంతి'కి మాతృవియోగం



కాంతమ్మ(ఫైల్)

నర్సంపేట: నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి మాతృ వియోగం కలిగింది. చెన్నారావుపేట మండలం అమీనాబాద్‌కు చెందిన దొంతి మాధవరెడ్డి మాతృమూర్తి కాంతమ్మ (88) అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. రాత్రి 9 గంటల నుంచి ఎమ్మెల్యే నివాసంలో కాంతమ్మ పార్థివదేహాన్ని ప్రజలు, అభిమానుల సందర్శనార్థం ఉంచారు. ఆదివారం మధ్యాహ్నం హనుమకొండలోని పద్మాక్షి గుట్ట పక్కన గల శివముక్తి ధామ్ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు హనుమకొండలోని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నివాసానికి చేరుకుని కాంతమ్మ పార్థివదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నకిలీ కానిస్టేబుల్ అరెస్ట్

- వివరాలు వెల్లడించిన పోలీసులు



నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీఐ సత్యనారాయణరెడ్డి

జనగామ: ఓ నకిలీ కానిస్టేబుల్‌ను జనగామ పోలీసులు అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి ఫోన్, పోలీస్ ఐడీ కార్డు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శనివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ సత్యనారాయణరెడ్డి వివరాలు వెల్లడించారు. జనగామకు చెందిన కిరణ్ నాలుగేళ్ల క్రితం పట్టణ పోలీసు వెహికిల్‌పై ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేశాడు. ఇదే సమయంలో మూడేళ్ల క్రితం ఓ యువతిని ప్రేమించిన విషయంలో కేసు నమోదు కావడంతో జైలుకెళ్లాడు. జైలు నుంచి విడుదలైన తర్వాత తన బంధువు కానిస్టేబుల్ కుమారస్వామి ఐడీని తస్కరించి పెంబర్తి, నెల్లుట్ల ప్రధాన రహదారిపై పోలీసు వేషంలో అర్ధరాత్రి సమయంలో వాహనాల తనిఖీ పేరిట డబ్బులు వసూలు చేశాడు. ఇదిలా ఉండగా కిరణ్ బావ బంధువుపై జనగామకు చెందిన వ్యక్తులు గ్యాంగ్ రేప్ చేసిన ఘటనలో ఇద్దరి వ్యక్తులపై కేసు నమోదు చేయొద్దంటే రూ.2.50లక్షలు ఇవ్వాలని బెదిరింపులకు దిగాడు. ఈ ఘటనపై ఎండీ అన్వర్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు కిరణ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు. కాగా, నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సీఐ సత్యనారాయణ రెడ్డి, ఎస్సై భరత్, కానిస్టేబుళ్లు బి.కరుణాకర్, ఎన్.సాగర్, బి.కృష్ణ, పి.చరణ్, ఇ.రాజేశ్, ఎం.మధుసూదన్‌ను ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్, డీసీపీ రాజమహేంద్ర నాయక్, సీపీ సన్‌ప్రీత్‌సింగ్ అభినందించారు.

భార్యను చంపిన భర్త ..

నెల్లికుదురు : భార్యను గొడ్డలితో నరికి చంపిన భర్తను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కేసముద్రం సీఐ వై.సత్యనారాయణ తెలిపారు. ఈమేరకు శనివారం నెల్లికుదురు పీఎస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నెల్లికుదురు మండలం ఆలేరులో ఈ నెల 3న కుమారుడి మీద కోపంతో క్షణికావేశానికి గురైన చీకటి నరేశ్ తన భార్య స్వప్న (38)ను గొడ్డలితో నరికి చంపి పరారైన విషయం విదితమే. ఈ ఘటనపై మృతురాలు సోదరి మాచర్ల ఉమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు నెల్లికుదురు నుంచి తొర్రూరు వైపునకు వెళ్తున్న నరేశ్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. పెద్ద కుమారుడు విక్రం జులాయిగా తిరుగుతుంటే మందలిస్తున్న ప్రతీసారి తల్లి అడ్డు పడుతుందని, దీంతో తన భార్యను చంపితేనే కుమారుడు మారుతాడనే ఉద్దేశంతో ఆమెను గొడ్డలితో నరికి చంపినట్లు నరేశ్ ఒప్పుకున్నాడు. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఎస్సై చిర్ర రమేశ్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీఐ, ఎస్సై

విశ్రాంత ఉద్యోగుల పోరుబాట..

- కుటుంబ ఖర్చులు, వైద్య అవసరాలకు ఇబ్బందులు
- కోర్టు ఆదేశాలు అమలు చేయాలని డిమాండ్



కాశోజీ సెంటర్ : రెండు, మూడు దశాబ్దాల పాటు ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేసి రిటైర్డ్ అయిన వారి ఆర్థిక పరిస్థితి కడు దయనీయంగా మారింది. సర్వీస్‌లో ఉన్నంత కాలం జీపీఎఫ్, పీఎఫ్ రూపంలో పైసాపైసా కూడగట్టుకున్న సొమ్ముతో సొంతిల్లు కట్టుకోవాలని, కూతురు పెళ్లి చేయాలని, ఇతర అవసరాలు తీర్చుకోవాలనుకుంటున్న పలువురి ఆశలు అడియాశలవుతున్నాయి. ఉద్యోగ విరమణ చేసి రెండు సంవత్సరాలు కావొస్తున్నా ప్రభుత్వం నుంచి వారికి అందాల్సిన డబ్బులు ఇంత వరకూ చేతికి రాలేదు. దీంతో కుటుంబ అవసరాలు గడవకపోవడంతోపాటు ఆరోగ్య ఖర్చులకు డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొద్ది నెలల క్రితం ముఖ్యమంత్రి స్వయంగా ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ సంవత్సరం సమయం ఇస్తే విశ్రాంత ఉద్యోగులందరి డబ్బులు చెల్లిస్తానని హామీ ఇచ్చారు. ఈ ప్రక్రియ నేటికీ ప్రారంభం కాకపోవడం వారిలో ఆశలు సన్నగిల్లుతున్నాయి. కనుచూపుమేరలో బెనిఫిట్స్ వచ్చే పరిస్థితి కనిపించకపోవడంతో మానసిక వేదనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ ఫించన్ డబ్బులు ఖాతాల్లో జయచేయాలని వేడుకుంటున్నారు.

కోర్టు ఆదేశాలు అమలు చేయాలి..

రిటైర్మెంట్ బెనిఫిట్స్ విడుదలలో ప్రభుత్వం జాప్యం చేయడంతో కొంత మంది విశ్రాంత ఉద్యోగులు కోర్టు ఆశ్రయించారు. స్పందించి కోర్టు.. విశ్రాంత ఉద్యోగులకు ఎనిమిది వారాల్లో రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని ఆదేశించింది. అయినా ప్రభుత్వం ఇప్పటి వరకూ తమకు బెనిఫిట్స్ ఇవ్వడం లేదని పలువురు విశ్రాంత ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇవే కాకుండా మెడికల్ బిల్లులు కూడా ఇవ్వడం లేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి వెంటనే కోర్టు ఆదేశాలు అమలు చేసి బెనిఫిట్స్ విడదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

నేటి ఉద్యమ కార్యాచరణకు సిద్ధమవుతున్న విశ్రాంత ఉద్యోగులు..

సుమారు రెండు సంవత్సరాల నుంచి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకపోవడంతో విశ్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయులు పోరుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఈనెల 1వ తేదీన పోరుబాటకు సంబంధించి సన్నాహక సమావేశం కూడా జరిగింది. ఇందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని విశ్రాంత ఉద్యోగులతో చర్చించి నేడు (ఆదివారం) హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు సంఘం బాధ్యులు వెల్లడించారు. రిటైర్డ్ ఎంప్లాయీస్ బెనిఫిట్స్ సాధన సమితి పేరుతో పోరుబాట పట్టనున్నట్లు కన్వీనర్స్ కందుకూరి దేవదాస్, కడారి భోగేశ్వర్ తెలిపారు. బెనిఫిట్స్ సాధన కోసం ఆదివారం ఉద్యమ కార్యాచరణ ప్రకటించనునట్లు వారు తెలిపారు.

ఇబ్బంది పెట్టకుండా బెనిఫిట్స్ ఇవ్వాలి..



ప్రభుత్వం ఇబ్బంది పెట్టకుండా విశ్రాంత ఉద్యోగులకు బెనిఫిట్స్ ఇవ్వాలి. రెండు సంవత్సరాలుగా విశ్రాంత ఉద్యోగులు బెనిఫిట్స్ కోసం ఎదురుచూస్తున్నారు. ఇంటి వద్ద విశ్రాంతి తీసుకోవాల్సిన సమయంలో ప్రభుత్వం బెనిఫిట్స్ ఇవ్వకపోవడంతో మానసిక వేదనకు గురవుతున్నాం. బెనిఫిట్స్ సాధన కోసం నేడు పోరాట కార్యాచరణ ప్రకటిస్తాం.

-కందుకూరి దేవదాస్, కన్వీనర్, రిటైర్డ్ ఎంప్లాయీస్ బెనిఫిట్స్ సాధన సమితి భూపాలపల్లి

కోర్టు ఆదేశాలు అమలు చేయాలి



రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపులో ప్రభుత్వ నిర్లక్ష్యం చేయడంతో కొంత మంది విశ్రాంత ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు కూడా ఎనిమిది వారాల్లో విశ్రాంత ఉద్యోగుల బెనిఫిట్స్ క్లియర్ చేసి వారి ఖాతాల్లో జమచేయాలని ఆదేశించింది. అయినా కార్యరూపం దాల్చడం లేదు. విశ్రాంత ఉద్యోగుల పట్ల ప్రభుత్వం వైఖరి సరికాదు. వెంటనే కోర్టు ఆదేశాల ప్రకారం బెనిఫిట్స్ జమచేయాలి.

-కడారి భోగేశ్వర్, కన్వీనర్, రిటైర్డ్ ఎంప్లాయీస్ బెనిఫిట్స్ సాధన సమితి, వరంగల్

కారు ఢీకొని మహిళ మృతి



హైమ (ఫైల్)

వర్ధన్నపేట : బస్సు కోసం వేచి చూస్తున్న మహిళను కారు ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణం కోల్పోయింది. ఈ ఘటన శనివారం మండలంలోని ఉప్పరపల్లి క్రాస్ రోడ్డు వద్ద జరిగింది. వర్ధన్నపేట ఎస్సై సాయిబాబు కథనం ప్రకారం.. మండలంలోని ఉప్పరపల్లికి చెందిన గ్రామ పంచాయతీ స్వీపర్ జిల్లా హైమ (38) శనివారం ఉదయం ఉప్పరపల్లి క్రాస్ వద్ద వర్ధన్నపేటకు వెళ్లేందుకు రోడ్డు పక్కన నిలబడి ఉంది. ఈక్రమంలో వర్ధన్నపేట నుంచి వరంగల్ వైపునకు వెళ్తున్న కారు అదుపు తప్పి హైమను ఢీకొంది. ఈ ఘటనలో ఆమె ఎగిరి పడగా తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. అనంతరం అదే కారు ఉప్పరపల్లి వైపు వెళ్తున్న మరో కారును కూడా ఢీకొనడంతో ఆ కారు దెబ్బతింది. మృతురాలి కుమార్తె శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయిబాబు తెలిపారు. హైమ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తి..

ములుగు రూరల్ : మండలంలోని దేవగిరిపట్నానికి చెందిన ఓ వ్యక్తి చెట్టు పైనుంచి పడి మృతి చెందాడు. దేవగిరిపట్నం గ్రామం బోటిమీది తండాకు చెందిన భూక్య శ్రీనివాస్ (42) రోజువారీ కూలీతోపాటు మిషన్ కొనుగోలు చేసుకుని చెట్లు కోస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం గ్రామంలో పనికి వెళ్లి చెట్టుపై నుంచి రాయిపై పడ్డాడు. దీంతో తీవ్ర గాయం కావడంతో యజమాని గమనించి 108లో ములుగు ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య జమున, కుమార్తెలు పూజ, తేజ ఉన్నారు. శ్రీనివాస్ మృతితో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. శ్రీనివాస్ కుటుంబ సభ్యులను గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.



శ్రీనివాస్ (ఫైల్)

కుంటలో పడి యువకుడు..



మల్సూర్ (ఫైల్)

పెద్దవంగర: కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లిన ఓ యువకుడు కుంటలో పడి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం పోచారం గ్రామ పరిధిలోని భద్రు తండాకు చెందిన బానోత్ మల్సూర్ (26)కు మతిస్థిమితం లేదు. పదేళ్ల క్రితం విద్యుత్ ప్రమాదంలో రెండు చేతులు కోల్పోయాడు. అప్పటి నుంచి భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం సమీపంలోని కుంటలోకి బహిర్భూమికి వెళ్లాడు. కాలకృత్యాలు తీర్చుకుని తిరిగి వస్తున్న క్రమంలో కుంటలో పడి మునిగిపోయాడు. శనివారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులకు నీటిలో మల్సూర్ మృతదేహం కనిపించింది. కాగా, ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

గొర్రె, దూడను బలిగొన్న కొండచిలువ

దంతాలపల్లి : మండల శివారులోని 60 డీబీఎల్ కాల్వలో కొండచిలువ.. ఓ గొర్రె, దూడను బలిగొంది. ఉదయం కాల్వ పక్కన వెళ్తున్న యువకులు ఈ దృశ్యాన్ని గమనించి ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. భారీ కొండచిలువ.. గొర్రె, దూడను చుట్టుకొని వాటిని మింగేందుకు యత్నించడం చూసిన వారు వెంటనే గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్తులు ఘటనాస్థలికి చేరుకుని కొండచిలువను బంధించేందుకు కాల్వలో వల వేశారు. అయితే వలలో చిక్కకుండా కొండచిలువ తప్పించుకుంది. స్థానికులు గొర్రె, దూడను బయటకు తీయగా అప్పటికే మృతిచెందాయి.



కాల్వలో గొర్రె, దూడను చుట్టుకున్న కొండచిలువ

ఆపన్నహస్తం అందించరూ..

- మెడికల్ సీటు సాధించిన నిరుపేద విద్యార్థిని
- అయితే ప్రవేశానికి చేతిలో చిల్లిగవ్వలేని దుస్థితి
- దాతలు చేయూతనివ్వాలని వేడుకోలు



తల్లిదండ్రులతో శ్రుతి

వర్ధన్నపేట: చదువుల తల్లికి లక్ష్మీకటాక్షం కరువైంది. కడు పేదరికంలో జన్మించి ప్రభుత్వ గురుకులంలో కష్టపడి చదివి జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ పరీక్షలో ర్యాంకు సాధించింది. అయితే ఆ విద్యార్థిని ఉన్నత విద్యనభ్యసించడానికి చేతిలో చిల్లిగవ్వలేని దుస్థితి. తల్లిదండ్రులది రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి. దీంతో ఆ విద్యార్థినితోపాటు తల్లిదండ్రులు ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. దాతలు చేయూత ఇవ్వాలని చేతులెత్తి వేడుకుంటున్నారు. వివరాల్లో వెళ్తే.. వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణానికి చెందిన ఆనపర్తి యాకాంత, సామ్యూల్ నిరుపేదలు. వీరు జీవనోపాధి కోసం హైదరాబాద్ వలస వెళ్లారు. సామ్యూల్ దివ్యాంగుడు కాగా, యాకాంత ఇళ్లలో పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ దంపతుల కూతురు శ్రుతి నీట్ పరీక్షలో ర్యాంకు సాధించి భద్రాద్రి కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. అయితే ఆర్థిక కారణాలతో శ్రుతి ఉన్నత చదువు ప్రశ్నార్థకంగా మారిందని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. దీనిపై దాతలు స్పందించి తమ కూతురు ఉన్నత చదువుకు చేయూనందించాలని వేడుకుంటున్నారు. దాతలు 8977280508 నంబర్‌లో శ్రుతిని సంప్రదించి ఆర్థిక సాయం అందజేయాలని వారు కోరుతున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్యాయత్నం..

- చికిత్స పొందుతూ మృతి



కృష్ణ(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : ఆర్థిక ఇబ్బందులతో ఓ రైతు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి శనగపురం శివారు పాత తండాలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై దీపిక శనివారం కేసు వివరాలు వెల్లడించారు. తండాకు చెందిన ధరావత్ కృష్ణ (45), భారతి దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వారికి 30 గుంటల వ్యవసాయ భూమి ఉండగా దానితోపాటు మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని మిర్చి, పత్తి పంటలు సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో కుటుంబ అవసరాలు, వ్యవసాయానికి రూ.5 లక్షల మేర అప్పు అయ్యింది. ఎలా తీర్చాలని కొంతకాలంగా మనోవేదనకు గురవుతున్న కృష్ణ.. ఈ నెల 01వ తేదీన గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు వరంగల్ ఎంజీఎం తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై భార్య భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దీపిక తెలిపారు.